క్లుప్తంగా

రసాయన ఎరువుల వినియోగంతో అనర్థాలు



సింగవరంలో వరి సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

డెంకాడ: రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంతో ఎన్నో అనర్థాలు వస్తాయని వ్యవసాయాధికారులు టి.సంగీత, పూడి నిర్మల అన్నారు. మండలంలోని సింగవరంలో పిట్ట శ్రీనివాసరావు పొలంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. ఖరీఫ్ పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఈ – పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. ఉత్పత్తిదారుల సంఘంలో చేరడానికి విధివిధానాలను రెల్లివలస రైతు శ్రీరామాంజనేయులు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రామకోటి, మాస్టర్ ట్రైనర్ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హర్షణీయం..



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘ నాయకులు పేరి రామయ్య పంతులు, ద్వాదశి వేణు, తదితరులు

విజయనగరం టౌన్: ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం అర్చకులకు గౌరవ వేతనం రూ. 10 వేల నుంచి 15 వేల రూపాయలకు పెంచడం హర్షణీయమని బ్రాహ్మణ సంక్షేమ సంఘ ప్రతినిధులు పేరి రామయ్యా పంతులు , ద్వాదశి వేణు, దవళ వెంకటరావు, ఇనుగంటి రాకేష్ శర్మ, సారిపాక రమణమూర్తి, తదితరులు అన్నారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ధూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తం ఐదు వేల నుంచి రూ.10 వేలకు పెంచారని.. నిరుద్యోగ వేద విద్యార్థులకు నెలకు రూ. 3 వేల భృతి ఇచ్చేందుకు నిర్ణయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వడ్లమాని సుభద్ర శేఖర్, సంబర సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

కషాయాలతో చీడపీడల నివారణ



కషాయాల తయారీని పరిశీలిస్తున్న ప్రకాష్

విజయనగరం ఫోర్ట్: కషాయాలతో వివిధ పంటల్లో తెగుళ్లను నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ తిమోటిక్ లీడర్ ప్రకాష్ అన్నారు. మండలంలోని జొన్నవలస రైతుసేవా కేంద్రం వద్ద కషాయాల తయారీని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కషాయాలను రైతులు సక్రమంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ప్రసాద్, వీఏఏ సందీప్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

వేపాడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 2లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గురువారం మొక్కలు నాటారు. వన మహోత్సవంలో భాగంగా వీటిని సూపర్‌వైజర్లు జి.కామేశ్వరి, పి.భాగ్యవతి తదితరులు నాటారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని సూపర్‌వైజర్లు కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కార్యకర్తలు మంగలక్ష్మి, రాజేశ్వరి, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

శృంగవరపుకోట: జీవిత బీమా రంగాన్ని నిర్వీర్యం చేసేలా చేస్తున్న కుట్రలను ఉపసంహరించుకోవాలని ఎల్ఐసీ ఏజెంట్లు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఏజెంట్లు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నినాదాల చేశారు. ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన పిలుపు మేరకు సిఐటీయూ నేతృత్వంలో ఆందోళన చేసిన ఏజెంట్లను ప్రభావితం చేసే బీమా సుగం, బీమా విస్టార్, బీమా వాహక్, బీమా ట్రినిటీ, బీమా విట్రాగ్, జీవన్ సమర్ధలను అమలు చేయొద్దని, ఎల్ఐసీని జీఎస్టీ నుంచి మినహాయించాలని, రూ.5లక్షలు దాటిన పాలసీలపై ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని నినాదాలు చేశారు. పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

లక్కవరపుకోట : మండలంలోని బుధవారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి మూడు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి నేల కొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగింది. దీంతో ఆ శాఖ ఏఈ కృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ఉదయం యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను చేపట్టారు. సంతపేట, లక్కవపుకోట గ్రామంలో గాలివానకు విరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి వేశారు. ప్రమాదకరంగా వున్న చెట్టు కొమ్మలను తొలగించారు.

అమ్మ భాష అమృతం..

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



విజయనగరం: రచయిత ఆంధ్ర భాస్కర సుబ్బారావును సత్కరిస్తున్న నిర్వాహకులు



విజయనగరం అర్బన్: గిడుగు వారి వేషధారణలో విద్యార్థులతో అధ్యాపకులు



పూసపాటిరేగ : విద్యార్థినుల వేషధారణలు



భోగాపురం: ఆదర్శ పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థినుల వస్త్రధారణ



నెల్లిమర్ల: వివిధ వేషదారణలో విద్యార్థులు

విజయనగరం: అమ్మ భాష అమృతతుల్యమని ప్రముఖ రచయిత, మహారాజా బీఈడీ కళాశాల విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు ఆంధ్ర భాస్కర సుబ్బారావు అన్నారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి (తెలుగు భాషా దినోత్సవం) సందర్భంగా సుదీర్ఘకాలం తెలుగు భాషకు సేవ చేసిన 90 ఏళ్ల సుబ్బారావును తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, డాక్టర్ జక్కు రామకృష్ణ గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత మాట్లాడుతూ.. ఏ జీవన వ్యవస్థకైనా భాషే ముఖ్యమని, భాషను బతికించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతన్నారు. భాష రాకుంటే భావం తెలియదని, ఆలోచన రాదని, రాష్ట్ర ప్రగతిలో కూడా మాతృభాష ప్రధాన భూమిక పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు భాషాభిమానులు పాల్గొన్నారు.

భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది..

పూసపాటిరేగ : తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్థానిక కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎ. భారతి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, మనది అనుకొనే తెలుగు భాషను వ్యవహారిక భాషలా ఎల్లవేళలా వాడాలన్నారు. అనంతరం తెలుగు కవుల వేషాధారణలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో..

విజయనగరం అర్బన్: రింగురోడ్డులో గల శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీధర్‌బాబు, పాఠశాలల రీజనల్ ఇన్‌చార్జ్ వి.శ్రీనివాసరావు, ఎం.భార్గవనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ..

భోగాపురం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ పార్వతి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలుగు విశిష్టతను వివరించారు. విద్యార్థులు వేషధారణలతో ఆకట్టుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

విజయనగరం అర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. తొలిత గిడుగు రామమూర్తి పంతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శుభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రచయిత గంట్రేడ గౌరినాయుడు, సిరికి స్వామినాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ రమాగీత కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే జేఎన్‌టీయూ జీవీలో 'జాతీయ క్రీడా దినోత్సవం' నిర్వహించారు. ముందుగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల వివిధ క్రీడాంశాలల్లో విజేతలుగా నిలిచిన పలువురు క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏవీ పాపారావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డాక్టర్ కె.నాగరాజు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నవ వైతాళికుడు గిడుగు

నెల్లిమర్ల: తెలుగు భాష నవ వైతాళికుడు గిడుగు రామమూర్తి పంతులని డైట్ వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌టీ నాయుడు అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ రచయితలు గంటేడ గౌరినాయుడు, సిరికి స్వామినాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె. రామకృష్ణారావు, డి. ఈశ్వరరావు, ఎల్. రామకృష్ణారావు, కె. సూర్యారావు, పి. రవికుమార్, వీవీజే సుబ్రహ్మణ్యం, ఎం. రామకృష్ణ, భారతి, కమల, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే బుద్ధి చెబుతాం..



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు సూరిబాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో తగిన రీతిలో బుద్ధి చెబుతామని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. మండలంలోని కొండగుంపాంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడులు పెట్టలేక అన్నదాతలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలు తెరిచి నెలలు గడుస్తున్నప్పటికీ తల్లికి వందనం పథకం అమలు చేయకపోవడం బాధాకరమని చెప్పారు. ఇటీవల జరిగిన మంత్రి మండలి సమీక్షలో సంక్షేమ పథకాల ఊసే ఎత్తలేదన్నారు. తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరి, తవిటినాయుడు పాల్గొన్నారు.

ఈ - పంట నమోదుకు చర్యలు తీసుకుంటాం..

- వ్యవసాయ శాఖ జేడీ రామారావు
- సాక్షి ఎఫెక్ట్

పూసపాటిరేగ: ఈ – పంట నమోదుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామరావు అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో నత్తనడకన ఈ పంట నమోదు కావడంపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాఖ జేడీ స్పందించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ, నెల్లిమర్ల డివిజన్‌లో 18,094 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, 11,599 ఎకరాల్లో సాగు జరుగుతోందన్నారు. ఇందులో 9,013 ఎకరాల్లోని పంట వివరాలను ఈ – పంట యాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. మిగిలిన పంటను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

5 కె రెడ్ రన్ ద్వారా హెచ్ఐవీపై అవగాహన



5కె రెడ్ రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం: ప్రతిఒక్కరూ క్రీడల పట్ల మక్కువ పెంచుకుని, భాగస్వాములు కావాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు కోరారు. ఈ మేరకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కోసం స్థానిక విజ్జీ స్టేడియం వద్ద విద్యార్థులతో నిర్వహించిన 5 కిలోమీటర్ల మారథాన్ రెడ్ రన్‌ను ఆమె గురువారం ఉదయం ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్యారోగ్యశాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. యూత్‌ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ మారథాన్ పోటీలను బాలురు, బాలికలు, ట్రాన్స్ జెండర్స్ మూడు విభాగాలుగా విభజించి, ఒక్కో విభాగంలో ప్రథమ బహుమతి రూ.7,000, రెండో బహుమతి రూ.4,000 అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ క్రీడల్లో దేశం ఖ్యాతిని ఇనుమడింపజేసిన మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించుకుంటు న్నామని చెప్పారు. క్రీడారంగంలో ధ్యాన్‌చంద్ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ రాణి, పలువురు క్రీడాకారులు, కోచ్‌లు, విద్యార్థులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు



దాసన్నపేట ప్రాంతంలో పర్యటిస్తున్న అసిస్టెంట్ కమిషనర్, తదితరులు

- దాసన్నపేట, జమ్ము ప్రాంతాల్లో వార్డు పర్యటన
- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్న అసిస్టెంట్ కమిషనర్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులు గురువారం వార్డు పర్యటన చేపట్టగా.. స్థానికులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్రాంతాల్లో పశు సంచారం ఎక్కువగా ఉండడంతో వ్యర్థాల వల్ల ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. అదేవిధంగా నిరుపయోగంగా పడి ఉన్న సామాజిక మరుగుదొడ్డిని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. వివిధ ప్రాంతాలలో పర్యటించిన అధికారులు సమస్యలను తెలుసుకుని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. నగరంలోని దాసన్నపేట వాటర్ ట్యాంక్ వద్ద ప్రారంభమైన వార్డు పర్యటనలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గురువారం వార్డు పర్యటన చేపడుతున్నామన్నారు. వార్డు పర్యటనలు చేపట్టి వివిధ అంశాలను, ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. స్థానిక కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ.. తమ డివిజన్‌లో ఎన్నో ఏళ్లుగా అపరిశుభ్ర సమస్యలు నెలకొన్నాయని.. వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపుతారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు..

నెల్లిమర్ల: విద్యార్థులు మంచి ప్రణాళికతో చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సీఐ జి.రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసకాకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై డి. రామగణేష్, ఎన్ఎస్ఎస్ పీఓలు లెంక సంధ్య, ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఉచిత వైద్యసేవలు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) లబ్ధిదారులకు ఒక్క పైసా కూడా ఖర్చుకాకుండా ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నాణ్యమైన భోజనం, మెరుగైన చికిత్స రోగులకు అందించాలన్నారు. కార్యక్రమంలో టీమ్ లీడర్లు తుంపల్లి జనార్దనరావు, ఆర్. ముత్యాల నాయుడు, భాను, వి, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే... ప్రయాణం నరకమే...

వేపాడ: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బక్కునాయుడుపేట వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. వానొస్తే ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. బక్కునాయుడుపేటలో ఉన్న గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో 1300 మంది పిల్లలు చదువుతున్నారు. వీరి వద్దకు తల్లిదండ్రులు వారం వారం వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి బాగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు



గజపతినగరంలో శ్రీకృష్ణ ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

గజపతినగరం : మండల కేంద్రంలో శ్రీకృష్ణ ప్రతిమను బుధవారం ఊరేగించారు. వెంకటాపురం గ్రామం నుంచి గజపతినగరం హైవే మీదుగా గణేష్ కోవెల, దిగువ వీధుల మీదుగా అంగరంగ వైభవంగా భక్తులు ప్రతిమను ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమి నుంచి నేటి వరకు రోజూ పూజలు నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి కమిటీ అధ్యక్షుడు దివకాల గోవిందు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఖాతా ఆన్‌లైన్ చేయాలి

గుర్ల: సహకార సంఘంలో నమోదైన ప్రతి రైతు వివరాలు, ఖాతాలను వేగవంతంగా ఆన్‌లైన్ చేయాలని జేసీ సేతు మాధవన్ పీఏసీఎస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కెల్ల ప్రాథమిక సహకార సంఘాన్ని ఆయన గురువారం సందర్శించారు. రైతుల వివరాల కంప్యూటరీకరణ జరుగుతున్న తీరు పరిశీలించారు. సెప్టెంబర్ మొదటి వారం నాటికి పీఏసీఎస్‌లో ఉన్న రైతుల ఖాతాల వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. అక్టోబర్ నెల నుంచి పీఏసీఎస్ లావాదేవీలు అన్ని ఆన్‌లైన్‌లో జరుగుతాయని తెలిపారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఆదిలక్ష్మి, గుర్ల డీసీసీబీ బ్రాంచి మేనేజర్ ప్రీతి మానస, కెల్ల సొసైటీ సీఈఓ, మండల శ్రీను ఉన్నారు.

అన్ని రంగాల్లో నగర అభివృద్ధికి కృషి చేస్తా..

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో కమిషనర్ నల్లనయ్య గురువారం క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టారు. ముందుగా కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న మస్టర్ పాయింట్ వద్దకు వెళ్లి సిబ్బంది హాజరు పట్టిక గమనించారు. నిర్ణీత సమయానికి సిబ్బంది విధులకు హాజరవుతున్నారా, లేదా అని పరిశీలించారు. అనంతరం మెయిన్ రోడ్డుకు చేరుకుని గంటస్తంభానికి ఆనుకుని ఉన్న పూల దుకాణాలను తక్షణమే వెనక్కి జరపాలని ఆదేశించారు. అలాగే కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ఉన్న ప్రధాన రహదారిలో పళ్ల విక్రయదారులతో మాట్లాడారు. చెత్తాచెదారాలను రోడ్లపై వేయవద్దని సూచించారు. అదేవిధంగా ఘోషా ఆస్పత్రి వద్ద ఏర్పాటు కానున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, డీఈఈలు పాల్గొన్నారు.

స్టార్టప్‌లతో దేశాభివృద్ధి



పోస్టర్ ప్రజెంటేషన్‌ను వివరిస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధిలో యువ పారిశ్రామికులు రూపొందించిన 'స్టార్టప్'లు కీలక భూమిక పోషిస్తాయని సీతం కళాశాల డీన్ డాక్టర్ వై. నరేంద్రకుమార్ అన్నారు. గురువారం స్థానిక గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'సమాజంలో స్టార్టప్‌ల పాత్ర – ఇన్నోవేషన్ అంబాసిడర్ల సహకారం కోసం మెంటర్షిప్ మద్దతు' అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిభావంతులైన విద్యార్థుల కొత్త ఆలోచనలకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీఏ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని పర్యాటక భవనాలు



నిర్వహణకు నోచుకోని చింతపల్లి టూరిజం భవనాలు

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి బీచ్‌లో నిర్మించిన పర్యాటక భవనాలు పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. నిర్వహణ లేకపోవడంతో సుమారు 80 లక్షల రూపాయలతో నిర్మించిన భవనాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈ భవనాలు ప్రారంభించకుండానే చింతపల్లి బీచ్‌లో 2018 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం హయాంలో పర్యాటక ఉత్సవాలు జరిపి సుమారు 10 లక్షల రుపాయలు ఖర్చు చేశారు. ఎటువంటి ప్రయోజనం లేకుండానే ఉత్సవాలు పేరిట నిధులు దుబారా చేశారు. నిత్యం వందలాది మంది పర్యాటకులు చింతపల్లి బీచ్‌కు వస్తున్నప్పటికీ పర్యాటక భవనాలు ప్రారంభించకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

- ఆర్‌కేఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

విజయనగరం ఫోర్ట్: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్‌కేఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. జొన్నవలస హైస్కూల్‌లో గురువారం హెల్త్ వెల్‌నెస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్. శ్రావణి, పాఠశాల హెచ్ఎం జి.గాయత్రి , ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ ఎ. కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.